క్లుప్తంగా

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నిజాంపేట(మెదక్): సంఘ విద్రోహ చర్యలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంతో పాటు కల్వకుంట, నార్లాపూర్ గ్రామాల్లో బుధవారం పోలీస్ బలగాలు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జయపాల్ రెడ్డి, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు వేయించండి


టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

కౌడిపల్లి(నర్సాపూర్): గొర్రెలు, మేకలకు నల్ల మబ్బు వ్యాధి నివారణ కోసం టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాజు తెలిపారు. బుధవారం మండలంలోని వెల్మకన్న, లింగంపల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నల్లమబ్బు నివారణ కోసం ముందస్తుగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పశుపోషకులను ఆదుకునేందుకు ప్రతీ ఏడాది నల్లమబ్బు నివారణ టీకాలు ఉచితంగా వేస్తుందన్నారు. ఈనెల 21 వరకు మండలంలోని అన్ని గ్రామాలు, తండాల్లో టీకాలు వేస్తామని తెలిపారు. గొర్రెలు, మేకలకు నల్లమబ్బు వ్యాధి సోకినట్లయితే ముఖం నల్లబడటంతో పాటు మూతిపై పుండ్లు అవుతాయన్నారు. టీకాలు వేయించి జీవాలని రక్షించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీఓ కృష్ణకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, రైతులు భిక్షపతి, అగమయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల గులాంగిరి


మాట్లాడుతున్న సురేందర్‌గౌడ్

మెదక్: సిద్దిపేట నాయకులకు మెదక్ బీఆర్ఎస్ నాయకులు గులాంగిరి చేస్తున్నారని, మెదక్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలను తరలించుక పోయినా వారికే వత్తాసు పలుకుతున్నారని కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... మెదక్ జిల్లాలో ఎన్నికల నియమావళి ఒక్క కాంగ్రెస్ నాయకులకే వర్తిస్తుందా? బీఆర్ఎస్ నాయకులకు వర్తించదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పుకొని ఆ పార్టీ నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అధిష్టానం పునరాలోచించాలి

కొల్చారం(నర్సాపూర్): నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై అధిష్టానం పునరాలోచించి, బీసీ సామాజిక వర్గానికి ఆ సీటు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ కౌడిపల్లి బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, చిన్నఘనాపూర్ గ్రామ అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం చిన్నఘనాపూర్ గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలు ఉన్నారని, ఆ స్థానాన్ని బీసీలకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల యువజన పార్టీ అధ్యక్షుడు దర్జీ రాజు, ఎన్‌ఎస్‌యూ నర్సాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు శివప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని దండుపల్లిలో గ్రామస్తులు చేపట్టిన హనుమాన్ దేవాలయ పునర్నిర్మాణ పనులను జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత కొబ్బరికాయ కొట్టి పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావనతో మెలగాలని, దేవాలయాలతో ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్, నాయకులు భిక్షపతి, రాము పంతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే విజయానికి దోహదం

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి


శివ్వంపేట(నర్సాపూర్): అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు దోహదం చేస్తాయని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, రాష్ట్ర లేబర్ బోర్డ్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దంతాన్‌పల్లి, కొంతాన్‌పల్లి, గుండ్లపల్లి, మల్లుపల్లి, దొంతి, మగ్దుంపూర్, శభాష్‌పల్లి, మనోహరాబాద్ మండలం లోని పోతారం, పర్కిబండ, గౌతోజీగూడం గ్రామాల్లో బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీపీ హరికృష్ణ, జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌ను అమలు చేసిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. బుధవారం మండలంలోని రామయపల్లిలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు భూపతిరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు మహేశ్, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ పార్వతీమల్లేశ్, ఎంపీటీసీ నవనీత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రామయపల్లిలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హేమలత, ప్రజాప్రతినిధులు

ఎన్నికలకు పకడ్బందీ చర్యలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: శాసనసభ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రత్యేక అధికారుల సమావేశానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని హాజరై, మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికలు 2023 నియమావళి నామినేషన్ల నోటిఫికేషన్ విడుదల సందర్భంగా ఈ నెల 3 నుంచి అభ్యర్థుల ప్రచారాలపై నిఘా పెంచాలని సూచించారు. అభ్యర్థులు మతపరమైన దూషణలు చేయరాదని, నామినేషన్ వేసేటప్పుడు అభ్యర్థులతో పాటు ఐదుగురికి అనుమతి ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలపై నిరంతరం నిఘాలు, తనిఖీలు చేయాలని సూచించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు వాహనాలు ప్రచారానికి వాడకూడదని, ఎల్‌ఈడీ వాహనాలకు సీఈఓ అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. తనిఖీల్లో 10 లక్షలు పట్టి పడితే ఐటీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్‌ఓ పద్మశ్రీ, నర్సాపూర్ ఆర్‌డీఓ శ్రీనివాస్, మెదక్ ఆర్‌డీఓ అంబదాస్ రాజేశ్వర్, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు విముక్తి కలిగిద్దాం

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీయాదవ్

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్రంలో పదేళ్లుగా కొనసాగుతున్న అరాచక పాలనకు విముక్తి కల్పిద్దామని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీయాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం మాసాయిపేట మండల కేంద్రంతో పాటు రామంతాపూర్, రామంతాపూర్‌తండా, అచ్చంపేట, హకింపేట, బొమ్మారం, నాగ్సాన్‌పల్లి, కొప్పులపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కమలం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో మండల అధ్యక్షుడు వేణుగోపాల్, నియోజకవర్గ నాయకులు రమేశ్‌గౌడ్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.


మాసాయిపేటలో ప్రచారం చేస్తున్న మురళీయాదవ్

ఎమ్మెల్యే సోషల్‌మీడియా పోస్టులపై ఫిర్యాదు

చేగుంట(తూప్రాన్): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును కించపరిచేలా మాట్లాడుతూ పోస్టులు పెట్టిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ తెలిపారు. చేగుంట పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఎమ్మెల్యేను కించపర్చేలా మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లు పార్టీ నాయకులు గుర్తించారని అన్నారు. వ్యక్తి పోస్టులకు సంబంధించిన వీడియో ఆధారాలతో ఎస్‌ఐ హరీశ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేశ్‌రవికుమార్, సాయిరాజ్, మాజీ సర్పంచ్, రఘువీర్‌రావు, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, చంద్రశేఖర్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.


ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు చేగుంటకు హరీశ్‌రావు

చేగుంట(తూప్రాన్): మంత్రి హరీశ్‌రావు చేగుంట పర్యటనకు రానున్నట్లు మండల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు పాపన్నపేటకు పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలంలో గురువారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. మొదట ఉదయం 8 గంటలకు కొత్తపల్లిలో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తారు. అనంతరం తమ్మాయపల్లి, అర్కెల, సీతనగరం, బాచారం, ఎంకెపల్లి, చిత్రియాల్, గాజులగూడెం, కొడుపాక గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు.

చెరువులో మృతదేహం లభ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): సుడిగాలికి ఎగిరి పోయిన టాపర్(టార్పలిన్) కోసం చెరువులో దిగి గల్లంతైన రైతు బుధవారం శవమై లభించాడు. మండలంలోని కూకుట్లపల్లిలో మంగళవారం సుడిగాలికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద టాపర్ ఎగిరిపోయి చెరువులో పడటంతో దాన్ని తెచ్చేందుకు గ్రామానికి చెందిన రైతు చింతల లక్ష్మయ్య(52) చెరువులోకి దిగి గల్లంతైయ్యాడు. కాగా విషయం తెలియడంతో గ్రామస్తులు గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది వెతికిన ఆచూకి లభించలేదు. చీకటి పడటంతో సహాయ చర్యలు ఆపివేశారు. బుధవారం ఉదయం గ్రామస్తులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో వలవేసి వెతికితే.. లక్ష్మయ్య మృతదేహం లభించింది. దీంతో మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోకండి


శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

జిల్లా వ్యాప్తంగా బుధవారం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని మార్చాల్సిందే..

నర్సాపూర్: కాంగ్రెస్ నర్సాపూర్ అభ్యర్థిని మార్చాలని ఆ పార్టీ నాయకులు డిమాండు చేశారు. బుధవారం పలువురు పార్టీ నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ తమను సంప్రదించకుండానే ఆవుల రాజిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారని, ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి కోవర్టుగా మారాడని ఆయన ఆరోపించారు. అధిష్టానం స్పందించకపోవడం బాధగా ఉందని పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, మల్లేషం ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి పలువురు నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో అధిష్టానం పునరాలోచించుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌కు అనుబంధంగా పనిచేస్తూ కాంగ్రెస్ నాయకులను అయోమయానికి గురిచేస్తున్న అతడివల్ల పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం టికెట్ కేటాయించి వారం రోజులు గడిచినా పార్టీలో ఉన్న అసంతృప్తులను కలవకుండా బీఆర్ఎస్ నాయకుల ఇండ్లలోకి వెళ్లి కూర్చోవడం వల్ల నియోజకవర్గంలో పార్టీ పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందన్నారు. పార్టీ అధిష్టానం టికెట్ విషయంలో పునరాలోచించి బీసీ అభ్యర్థికి కేటాయించాలంటూ కోరారు. సమావేశంలో నాయకులు మహేందర్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, గుత్తి కిషన్, కిష్టయ్య, వెంకటేశ్, శేఖులు తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్ అన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని హెచ్‌ఎంపల్లిలో గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పాలనలో అందోల్ ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. అన్ని వర్గాల చూపు కాంగ్రెస్ వైపే ఉందని, ఇచ్చిన హామీలు నెరవేర్చే పార్టీ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. హామీల అమలులో నిర్లక్ష్యం వహించిన బీఆర్ఎస్‌కు గడ్డుకాలమేనన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ విజయాన్ని సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ నెంబర్ షేక్ మజార్, కాంగ్రెస్ నాయకులు భక్తుల కిషోర్, ఆశీలి సాగర్, చంద్రమోహన్ రెడ్డి, ఆకులపల్లి పాపయ్య, మహేశ్‌గౌడ్, దండు కాంతం, నల్ల అనిల్, చల్ల నర్సింలు, శివగౌడ్, ప్రవీణ్, సాయి శేషు గౌడ్, కుష్టి పోచయ్య, శివచందర్, దుర్గయ్య, నీలగిరి రాజు, రవి, ఎక్కిళ్ల రాములు, బానోతు లాలు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతి కిరణ్


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

అల్లాదుర్గం(మెదక్): మరోసారి అవకాశం ఇవ్వాలని అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతి కిరణ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు అప్పాజీపల్లి, కాయిదంపల్లి గ్రామాల్లో బుధవారం క్రాంతి కిరణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అల్లాదుర్గంలో ప్రచార రథంపై భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు బేతయ్య, ప్రకాశం, శివరాం, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి డాక్టరేట్

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని కొంతాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నరేశ్‌కు డాక్టరేట్ అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్, అమెరికాకు చెందిన అడోబ్ సీఈఓ పద్మశ్రీ శంతన్ నారాయణన్ ద్వారా ఆయన బుధవారం పీహెచ్‌డీ అందుకున్నారు. వ్యాయామ విద్యలో డాక్టరేట్ పొందడంపై ఎంఈఓ బుచ్యానాయక్, హెచ్‌ఎం సునంద, ఉపాధ్యాయులు, పీఈటీటీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్, సర్పంచ్ గైనిబైటి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి అభినందించారు.


పట్టా అందుకుంటున్న నరేశ్

మద్యానికి, డబ్బుకు బానిస కావొద్దు


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

నిజాంపేట(మెదక్): ఓటును మద్యానికి, డబ్బుకు బానిస కావొద్దని, ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రం నిజాంపేటలోని గాంధీ విగ్రహం వద్ద కళాజాత బృందంతో ఓటు హక్కుపై తహసీల్దార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కును దుర్వినియోగం చేయకుండా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు హక్కు కలిగిన వారు తప్పకుండా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజేందర్, పంచాయితీ కార్యదర్శులు నర్సింలు, చంద్రహాస్, అంగన్ వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు ఎర్ర శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం సునీత లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో హనుమంత్, యాదగిరి, సత్యనారాయణ, రాజు, సుధాకర్, శేఖర్, శ్రీశైలంతో పాటు మరో 30 మంది చేరారు.


పార్టీలో చేరుతున్న రెడ్డిపల్లి గ్రామస్తులు

కేసీఆర్ బీమా.. ఇంటింటికీ ధీమా

- ప్రజలు ఆలోచించి ఓటేయాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి పద్మా దేవేందర్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి కేసీఆర్ బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి చెప్పారు. బుధవారం మెదక్‌లోని 1, 2వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బీమా పథకంతో రాష్ట్రంలోని 93 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు మొదలవుతాయని రైతులు ఆలోచించి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగపతి, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ నేడు బీఆర్ఎస్ కండువా కప్పుకోనున్న పైతర సర్పంచ్

కొల్చారం(నర్సాపూర్): మండలంలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ చోటు చేసుకుంది. పైతర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ సంతోష ఎల్లేశం గురువారం బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకోనున్నారు. ఈసారి నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీత రెడ్డికి టికెట్ ఇవ్వడంతో ఆమెపై ఉన్న అభిమానంతో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు సర్పంచ్ సంతోష ఎల్లేశం బుధవారం సాక్షితో తెలిపారు.

◆ కాంగ్రెస్‌లో భారీ చేరికలు

అల్లాదుర్గం(మెదక్): మండలం బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన వందల మంది కార్యకర్తలు, నాయకులు బుధవారం మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కుతూరు త్రిషదామోదర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నప్ప, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు విశ్వేశ్వర్, వీరయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి కూతురు ఆంక్షారెడ్డితో కలిసి పార్టీ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బంగారమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట మాజీ సర్పంచ్ లక్ష్మణ్ మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ ఓటమి భయంతోనే దాడి

తూప్రాన్: దుబ్బాకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని తూప్రాన్ బీఆర్ఎస్ యువత తీవ్రంగా ఖండించారు.

◆ అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

పెద్దశంకరంపేట(మెదక్): అవినీతి నిర్మూలన అందరి బాధ్యత అని సంగారెడ్డి సబ్‌డివిజన్ మెయిల్ ఓవర్సీస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోస్ట్‌ఫీస్ వద్ద ర్యాలీ నిర్వహించారు. నవంబర్ 5 వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీయం రఘు, బీపియంలు మాణయ్య, గంగారాం, ప్రశాంత్, బీరప్ప, నిరంజన్, కృష్ణవేణి, సవిత, తదితరులున్నారు.

◆ కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సలాబత్‌పూర్, మత్రిచెట్టుతండా పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జరిగింది. పార్టీ ఉపాధ్యక్షుడు ప్రవీన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసి పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని గెలిపించాలని కోరారు.

◆ చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): పార్కింగ్ చేసి ఉంచిన ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీని చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు బుధవారం తెలిపారు.

◆ నేటి యువ గర్జనను విజయవంతం చేయండి

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జోగిపేటలో చేపట్టనున్న యువగర్జనను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్ బుధవారం కోరారు.

◆ జేఏసీ పేరుతో అమ్ముడుపోయిన బ్రహ్మం

అల్లాదుర్గం(మెదక్): జేఏసీ పేరుతో మోసం చేసిన బ్రహ్మంకు తగిన గుణపాఠం చెబుతామని కాంగ్రెస్ నాయకులు యాదయ్య, ప్రభు హెచ్చరించారు. అల్లాదుర్గం రెవెన్యూ డివిజన్ సాధన కోసం పార్టీలకు అతీతంగా జేఏసీ పెట్టి దీక్షలు చేసి తర్వాత జేఏసీ అధ్యక్షుడు బ్రహ్మం బీఆర్ఎస్ పార్టీ ఇచ్చే డబ్బులకు అమ్ముడుపోయి, దీక్ష విరమించినట్లు కాంగ్రెస్ నాయకులు విలేకరులతో ఆరోపించారు. కార్యక్రమంలో కేశ్యనాయక్, రాములు నాయక్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి అంత్యక్రియలకు వెళ్లి వస్తున్న ఆటోను కారు ఢీ కొట్టడంతో ఆటో కాల్వలో పడి బోరంచ మొగులయ్య మృతి చెందగా పలువురికి తీవ్రగాయ పడిన సంగతి విధితమే. క్షతగాత్రుల్లో మండలంలోని ముస్లాపూర్ గ్రామానికి చెందిన పెంటయ్య(50) సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అలాగే బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన పంది ముక్కల కిష్టయ్య(48) నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు.